www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 ఫిబ్రవరి 2024
5
అన్నమయ్య

మున్సిపాలిటీలో హ్యాండ్‌వాష్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా నూతనంగా హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతులు తరచూ శుభ్రం చేసుకోవడం వలన అనేక రకాల అంటు వ్యాధుల నుంచి సంరక్షించుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ స్టేషన్ ప్రారంభించామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంబాబు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ గోపీనాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు మర్రి రవి, షేక్ మున్నాఫ్, కౌన్సిలర్లు న్యామతుల్లా, తిమ్మారెడ్డి రఘు దొంక సూరి, తోట లక్ష్మీనారాయణ, భాజా, వైసిపి నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


హ్యాండ్‌వాష్ స్టేషన్ ప్రారంభిస్తున్న ఆకేపాటి

బెరైటీస్ అక్రమ టెండర్‌ను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మంగంపేట బెరైటీస్ అక్రమ టెండర్లను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిఎండిసి మంగంపేట బెరైటీస్ సి అండ్ డి గ్రేడ్ నిల్వలో కేవలం 75 లక్షల టన్నులు మాత్రమే స్టాక్ యార్డ్‌లో ఉంటే ఇంకా తీయని 25 లక్షల మెట్రిక్ టన్నులకు పారదర్శకత లేకుండా అక్రమంగా టెండర్లు పిలవడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ తమకనుకూలంగా గుత్తేదారులకు బడా కంపెనీలకు ముందే నిర్ణయించుకున్న వారికి కట్టబెట్టడానికి టెండర్ షెడ్యూల్ పెట్టారన్నారు. సామాన్యులకు అందుబాటులో లేకుండా రూ.30 లక్షల కడితేనే, టెండర్ దాక్యుమెంటరీ, డౌన్‌లోడ్ లభ్యమవుతుందన్నారు. పారదర్శకత గురించి మాట్లాడే ప్రభుత్వం, ఎందుకిలా చేసిందని ప్రశ్నించారు. ఇప్పటికే స్థానికులు, మధ్య తరగతి కుటుంబాలు కట్టుకున్న బెరైటీస్ మిల్లులు మూతపడ్డాయన్నారు. గతంలో ఎక్స్‌పోర్ట్ కంపెనీలకు 60 శాతం స్థానిక మిల్లులకు 40 శాతం ముడి సరుకు ఇచ్చేవారని, దాన్ని పూర్తిగా రద్దు చేశారన్నారు. దీని ఫలితంగా మిల్లులు మూతపడి 30 వేల మంది దాకా ప్రత్యక్ష పరోక్షంగా ఉపాధి కోల్పోయారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలోనూ, ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలోనూ ఎటువంటి సెక్యూరిటీ డిపాజిట్ లేకుండా, రాజకీయ రికమండేషన్లతో ఎపిఎండిసి యాజమాన్యం వేల టన్నులు, రూ.కోట్ల అప్పులు ఇచ్చారని, వసూలు చేయకుండా, సంస్థను దివాలా తీస్తున్నారన్నారు. కార్మికుల జీతాలు పెంచమంటే మీనమేషాలు లెక్కిస్తారని, కార్మికుల శ్రమతో ఉత్పత్తి అయిన, సంపదను, అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు, తమకు కావలసిన వారికి కట్టబెడుతున్నారని విమర్శించారు. బెరైటీస్ మైనింగ్‌లో ఏ గ్రేడ్ బి గ్రేడ్, ఉత్పత్తి, తగ్గిపోయిందన్నారు. బెరైటీస్ అంతర్జాతీయంగా డిమాండ్ ఉందన్నారు. కారుచౌకగా సరుకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో సిపిఎం మండల శాఖ కార్యదర్శి లింగాల యానాదయ్య, మండల నాయకులు పి.జాన్ ప్రసాద్, పి.మౌలాలిఖాన్, ముత్యాల శ్రీనివాసులు, బండారు రాజశేఖర్, డి.శంకర్ రాజు, ఎం.విజయ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

పెండింగ్ ఫారాలను త్వరితగతిన పరిష్కరిస్తాం

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రచురించిన తరువాత అందిన ఫారాలను పక్కగా పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడలోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి '2024 తుది ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు, దరఖాస్తుల పరిష్కారం, 18–19 యువ ఓటర్ల నమోదు, ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మానవ వనరుల ఎన్నికల శిక్షణ, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాల కల్పన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వెబ్ కాస్టింగ్, ఇవిఎం వివి ప్యాట్ల భద్రత, ఎన్నికల నిర్వహణ ఖర్చు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, చీఫ్ ఎలెక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టరేట్‌తోపాటు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎఎస్‌పి రాజకమల్ హాజరయ్యారు. విసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024 తుది ఓటరు జాబితా ప్రచురించిన పిదప రాజకీయ పార్టీలు, ఇతరుల నుంచి అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఇంకను సుమారు 16,500 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. వీటిని పూర్తిగా పరిశీలించిన తరుఆవత త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. తుది ఓటరు జాబితాపై 604 చేర్పులు, 189 తొలగింపులకు విజ్ఞప్తులు వచ్చాయన్నారు. వీటిని కూడా పరిశీలన పూర్తి చేసి పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో 18 - 19 సంవత్సరాల యువత 31,700 మందిని నమోదు చేశామన్నారు. ఇంకను సుమారు 19 వేల మంది యువ ఓటర్లను నమోదు చేయాలని అంచనా కలదని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో వందశాతం కనీస సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గుర్తించిన పోలింగ్ కేంద్రాలలో ప్రస్తుతం 16 కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవని వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇవిఎం, వివి ప్యాట్‌లకు జిల్లా కేంద్రంలోని గోదాములో తగిన భద్రత, సిసి కెమెరాలు నిఘా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం నిమిత్తం అనువైన భవనాలను పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో సమస్యాత్మక, షాడో జోన్ పరిధిలోకి వచ్చే పోలింగ్ కేంద్రాల గుర్తింపు కూడా చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలేఖ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

'ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం'

షర్మిల దీక్షకు మద్దతుగా కార్యక్రమం చేపట్టిన నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధనకు పిసిసి అధ్యక్షులు షర్మిల శుక్రవారం ఢిల్లీలో చేపట్టిన దీక్షకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పీలేరు అంబేద్కర్ కూడలిలో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అమృత్‌తేజ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌కు ఐదు సంవత్సరాలు ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించిందన్నారు. బిజెపి నాయకులు తాము అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్‌కు 5 కాదు 10 ఏళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని బిజెపి నాయకులు పార్లమెంట్ సాక్షిగా చెప్పిన విషయం గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతి వెంకటేశ్వరస్వామి సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అనే అంశాన్ని ఉద్యమాల ద్వారా సజీవంగా ఉంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. ప్రత్యేక హోదాపై పోరాడ్డంలో ఆంధ్రప్రదేశ్ అధికార వైసిపి, విపక్షంలోని టిడిపి రెండూ విఫలమయ్యాయని విమర్శించారు. వైసిపి అధికారంలోకి రాకముందు 25 మంది ఎంపీలు ఇవ్వండి ప్రత్యేక హోదా నేను తెస్తానన్న నాటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదా మాట విస్మరించిందని పేర్కొన్నారు. కనీసం బిజెపిపై ఎటువంటి ఒత్తిడి కూడా తీసుకురావడం లేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలంటే అది కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని మరోసారి తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనేక రకాల నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ యుఐ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సాయి సంపత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి యూసఫ్, మండల అధ్యక్షులు శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై 8న ధర్నా

డిసికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కాంట్రాక్ట్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు జెఎల్ఎం గ్రేడ్–2 విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్‌కు, విద్యుత్ ఎస్ఇకి స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో జరుగుతున్న పరిమాణాలు విద్యుత్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనను, అభద్రతాభావాన్ని కలిగిస్తున్నాయని ఒకే సంస్థలో రెండు రకమైన సర్వీస్ రెగ్యులేషన్స్ తీసుకురావడం విద్యుత్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే అంశం అని విద్యుత్ ఉద్యోగులు గమనించాలని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ కంపెనీలలో కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు తగ్గించి చెల్లిస్తున్నారని, ట్రాన్స్‌కో, జెన్‌కోలతో సమానంగా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 5న అన్ని జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు. 8న అన్ని జిల్లా కేంద్రాలలో సర్కిల్ ఆఫీసుల వద్ద ధర్నా నిర్వహిస్తామని, 12 నుంచి విజయవాడలో నిరాహార దీక్షలు చేపడతామని తెలియజేశారు. స్ట్రగుల్ కమిటీ చేస్తున్న ఉద్యమాలకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామంజులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షులు కె. సుబ్రహ్మణ్యం రాజు, డివిజన్ అధ్యక్షులు నాగేష్ గౌడ్, సంబేపల్లి మండల కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, అశోక్, యుఇఇయు ప్రధాన కార్యదర్శి ఏ. వి. రమణ, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ అందజేస్తున్న సూరిబాబు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పరిశ్రమల అధికారి సూరిబాబు

ప్రజాశక్తి - రాయచోటి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో అన్నమయ్య జిల్లాలోని టివి టెక్నిషియన్స్‌కు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారని, యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన టివి టెక్నిషియన్స్ రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ రీజనల్ కో–ఆర్డినేటర్ లాలూ, నైపుణాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణతో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని టివి టెక్నిషియన్స్‌కు రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ పథకం కింద ఒక మార్గ దర్శక కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. సాంకేతిక నిపుణులకు కొత్త సాంకేతికతలలో అత్యాధునిక శిక్షణను అందించడంపై దృష్టి సారించామని తెలిపారు. కొత్తగా రూపు దిద్దుకున్న టెక్నాలజీకి అనుగుణంగా కొత్త టెక్నాలజీపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎవరైనా అర్హతగల నిరుద్యోగ, యువతి యువకులు స్వశక్తితో ఎదగాలంటే జిల్లా పరిశ్రమల శాఖా కార్యాల యాన్ని సంప్రదించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మాట్లా డుతూ జిల్లాలోని 120 మంది టివి టెక్నిషియన్‌కు రెండు రోజుల పాటు ప్రస్తుత టెక్నాలజీ, అత్యాధునిక సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, షిరిడి సాయి ఎడ్యుకేషన్ సొసైటీ మనోహర్ రెడ్డి, టివి అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీహరి కిషోర్, ఉస్మాన్ బాషా, ఫజులు రహమాన్ పాల్గొన్నారు.

'మానవత' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాయచోటి : మహోన్నతమైన సంకల్పంతో మానవత సంస్థ ప్రజలకు ఉపయో గకరమైన సేవలు అందించడం అభినందనీయమని సీనియర్ వైద్యులు బండారు కిరణ్‌కుమార్ మహేశ్వరరాజు, భాస్కర్‌రెడ్డి అన్నారు. మానవత సంస్థ సౌజన్యంతో బాడీ ఫ్రీజర్ బాక్స్, రెండు టేబుల్స్‌తో పాటు మానవత సభ్యులు, కీ.శే.ఎస్.వి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు సైకం వంశీ 30 ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన సేవలను అందిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా మానవత సంస్థ అందరి మన్నలను పొందుతుందన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసుకొని ఇటీవలే రోగులకు అందుబాటులోకి వచ్చిందన్నారు. రోగుల సౌకర్యార్థం మానవత సంస్థ సామగ్రి అందజేసినందుకు ఆసుపత్రి తరపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఈ ఆసుపత్రికి మానవత సంస్థ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మానవత గౌరవ సలహాదారులు వెంకట రమణ, మాజీ అధ్యక్షులు గుండ్లూరు వెంకటేష్, మానవత సభ్యులు సుదర్శన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాగశేశారెడ్డి, రుద్రాజు వెంకట రమణ రాజు, శ్రీకాంత్‌రెడ్డి, చంటి, ప్రసాద్, రామంజి, స్టాఫ్ నర్స్ కమల పాల్గొన్నారు.

ఆస్పత్రికి కుర్చీలు, బాడీ ఫ్రీజర్‌బాక్స్ అందజేస్తున్న దాతలు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : ఎంవిఐ

ప్రజాశక్తి-మదనపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణే రహదారి భద్రతా వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివ లింగయ్య అన్నారు. శుక్రవారం మదనపల్లెలో ఘనంగా 35వ జాతీయ రహదా భద్రతా వారోత్సవాలలో భాగంగా కార్యాలయం వద్ద జెండా ఊపి స్కూటర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రయాణికుడు రోడ్డు భద్రతా నియమాలనును తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు, విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణం అందించుటలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి బస్సు డ్రైవర్లు, విద్యా సంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రుల కమిటీలు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మదనపల్లె వన్ టౌన్ సిఐ మహబూబ్ వలీ, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి-మదనపల్లి

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని మదనపల్లి రెండవ పట్టణ నూతన సిఐ యువరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ మురళీకృష్ణ అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయ హెడ్ క్వార్టర్‌కు బదిలీపై వెళ్లిన సంగతి పాఠకులకు విధితమే. కాగా ఆయన స్థానంలో నూతన సిఐగా యువరాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు తనకు సమాచారం ఇస్తే అలాంటి కార్యకలాపాలను అరికట్టి ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పిస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనదారులు సహకరించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : జెసి

ప్రజాశక్తి రాయచోటి

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 2023–24 సంవత్సరానికి సంబంధించి మార్చి 1 నుండి మార్చి 20 వరకు అన్నమయ్య జిల్లాలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై ఇంటర్మీ డియట్ విద్య, ఏపీఎస్‌ఆర్టీసీ, పోలీస్, తదితర శాఖ అధికారులతో సమన్వయ కమిటీ తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని, కాపీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని అధికారులను ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి కృష్ణయ్య, జాయింట్ కలెక్టర్‌కు జిల్లాలో జరగబోతున్న ఇంటర్మీడియట్ పరీక్షల గురించి వివరించారు. జిల్లాలో మొత్తం 29,833 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోతున్నారని వీరిలో మొదటి సంవత్సరం 14,731 మంది రెండవ సంవత్సరం 15,102 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని తెలిపారు. వివరణాత్మక పరీక్షలు మార్చి 1 నుండి మార్చి 20 వరకు జరగబోతున్నాయని, ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుండి ఫిబ్రవరి 20 వరకు జరగబోతున్నాయని తెలిపారు. పర్యావరణానికి సంబంధించిన పరీక్షను ఫిబ్రవరి 3వ తారీకు నుంచి ఫిబ్రవరి 23వ తారీకు వాయిదా వేసినట్లుగా తెలిపారు. ఈ పరీక్షలను ఉదయం 9 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుపుతున్నట్లుగా వివరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందు చేరుకునేలా ఏపీఎస్‌ఆర్టీసీ వారు బస్సులను నడపాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త రాదని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో కాపీయింగ్ జరగరాదని పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆ శాఖ వారిని ఆదేశించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ విద్య, పోలీసు, వైద్య, ఎస్పీడీసీఎల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి నెల 9న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 08562–258622, 244622 ద్వారా కానీ, districts.ecourts.gov.in/Kadapa,dlsakdp@gmail.com ద్వారా కానీ సంప్రదించాలని పేర్కొన్నారు.

మలబార్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన

ప్రజాశక్తి - కడప అర్బన్

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఈనెల 2 నుంచి 11 వరకు వెండి ఆభరణాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు సంస్థ స్టోర్ హెడ్ లెసన్ సత్యన్ తెలిపారు. శుక్రవారం కోటిరెడ్డి సర్కిల్ వద్దనున్న మలబార్ షోరూమ్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనలో భాగంగా ప్రతి రూ.5వేల కొనుగోలు పై రూ.500 ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులకు 10 నాణ్యమైన వాగ్దానాలను అందిస్తున్నామని తెలిపారు. వార్షిక ఆదాయంలో సామాజిక బాధ్యతగా ఆరోగ్యం, ఉచిత విద్య, నిరుపేదలకు గృహ నిర్మాణం, మహిళా సాధికారత, పర్యావరణ రక్షణ విభాగంలో తమ వంతు సాయం అందజేస్తున్నామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల ధర్మాగ్రహమే 'సామాజిక సత్యాగ్రహం'

- విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్

సత్యాగ్రహం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లుగా పేద ప్రజలకు చేస్తున్న దగాపై వ్యక్తమవుతున్న ధర్మాగ్రహమే తాము చేపట్టిన సామాజిక సత్యాగ్రహయని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో విసికె పార్టీ నాయకులతో కలిసి సామాజిక సత్యా గ్రహం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జగన్ సర్కారు వచ్చిన తర్వాత రాష్ట్రంలో పెత్తందార్ల రాజ్యం నడు స్తోందని, పేద, మధ్యతరగతి వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ధనాన్ని, సహజ వనరులను యథేచ్ఛగా ఈ ప్రభుత్వం లూటీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం చేకూర్చే, పథకాలను ఈ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసిందన్నారు. జగనన్న గోరుముద్ద అని గొప్పగా చెప్పుకొనే పథకంలో రోజుకు రూ.34లతో విద్యార్థులకు భోజనం పెడుతున్నారని, రూ.34లతో మూడు పూటలు ఆ పిల్లలు కడుపునుండా తిండి తినగలరా? అని ప్రశ్నించారు. పేద పిల్లలంటే జగన్ సర్కారుకు చిన్నచూపని, అందుకే ప్రభుత్వ వసతీగృహాల్లోని విద్యార్థుల పట్ల నిర్ధయగా వ్యవహరిస్తోందని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో నాలుగున్నర ఏళ్లుగా పేద, మధ్యతరగతి వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై నిరసన వ్యక్తం చేయడానికే విసికె పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) సంయుక్తంగా ఆదివారం మదనపల్లిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సామాజిక సత్యాగ్రహం పేరుతో నిరసన దీక్ష చేపట్టడం జరుగుతోందని చెప్పారు. ఆదివారం సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ సాగే ఈ సత్యాగ్రహంలో వీసీకే పార్టీ మరియు బాస్ ప్రతినిధులతోపాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు, ప్రగతిశీల సంఘాల నాయకులు పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్ తోపాటు విసికె, బాస్ నాయకులు పెద్దపాలెం రవిశంకర్, రాయల్ సూరి, బురుజు రెడ్డిప్రసాద్, తలారి కృష్ణ, వై.గంగాధర్, వై.చిన్నా, బురుజు జనార్దన్, వెంకట్, రవి, డి.మోహన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి : ఇయు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట ఆర్‌టిసి డిపోలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డిఆర్ ప్రమీల ఉద్యోగులు, కార్మికులపై వేధింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తోందని, ఆమెపై వెంటనే విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సి.శేఖర్ డిమాండ్ చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తీరుకు నిరసనగా శుక్రవారం డిపో గేటు వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల డ్యూటీలు, బుకింగ్ విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా తీరు మారకుండా మరింత వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆమెపై పలుమార్లు అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ డిపో మేనేజర్ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. గ్యారేజీ అధికారి బిఎంవైఎం రాజు మాట్లాడుతూ డిపో మేనేజరు చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చల్లా వెంకటేష్, డిపో చైర్మన్ చలపతి, అధ్యక్షులు సుబ్బయ్య, కార్యదర్శి మౌలా, గ్యారేజీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, బాబు, నారాయణ, మురళీధర్, శంకరయ్య, ఈశ్వరయ్య, చంద్ర, రహమతుల్లా, రామయ్య, సునీల్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న జాకీర్ హుస్సేన్

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-గాలివీడు

ఉత్తమ ఫలితాలు సాందించాలంటే కష్టపడి చదవాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి డి.జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని గాలివీడు బాలురు వసతి గృహం, నూలివీడు బాలురు వసతి గృహాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. నూలివీడు బాలుర వసతి గృహంలో విద్యార్థులు తో మాట్లాడుతూ పదోతరగతి లో మంచి ఫలితాలు సాందించాలంటే కష్టపడి చదవాలి చెప్పారు. వార్డెన్లు రవీంద్ర నాయక్ , రవి బాబు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ సిఐగా శ్రీనివాసులు

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ కలకడ సిఐగా డి.శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ పి.నాగేంద్ర రాయచోటి దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా తాడిపత్రి సబ్ డివిజన్ యాడికి సర్కిల్ పరిధిలో ఉన్న పెద్దవడిగి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డి.శ్రీనివాసులు సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నత పొందారు. కడప నుంచి కలకడ పోలీస్ స్టేషన్‌కు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలపై దృష్టి సారించి, నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. మండలంలో పేకాట జూదం, కోడిపందెలు, నాటుసారా, దొంగతనాలు వంటి వాటిపై ఉక్కు పాదం మోపి వాటి నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు.

బి.కొత్తకోట సిఐగా ఎన్.సూర్యనారాయణ

బి.కొత్తకోట: బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ సిఐగా ఎన్.సూర్యనారాయణ నియమితులయ్యారు.శుక్రవారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.ఇటీవల బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ అప్ గ్రేడ్ అయిన విషయం విధితమే.ఈ నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ.రామ్మోహన్ గుడిపాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సిఐ స్థాయి అధికారిని నియ మించాల్సి ఉండగా డిఎస్‌పి శిక్షణ పూర్తి చేసుకున్న జి.ఎస్.ప్రశాంత్ ను ప్రభుత్వం ఎస్‌హెచ్ఒగా నియమించింది. ఆయన ట్రైనింగ్ బి.కొత్తకోటలో పూర్తి అవ్వడంతో రెగ్యులర్ సిఐగా సూర్యనారాయణను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తామని ,ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. బి.కొత్తకోట పట్టణం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉండటంవల్ల ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. పొరుగు రాష్ట్రాల అక్రమ మద్యం రవాణా, నాటుసారా తయారీ, విక్రయాలు, నేరాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ఎన్.సూర్య నారాయణ సిఐగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గాలివీడు ఎస్ఐగా వెంకట ప్రసాద్

గాలివీడు : ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో జిల్లా వ్యాప్తంగా ఎస్ఐల బదిలీలో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శివకుమార్ జిల్లా హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శుక్రవారం ఎస్ఐ బి.వెంకట ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా వెలుగోడు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు అని పేర్కొన్నారు. మండలంలో నావంతు బాధ్యత నిర్వహిస్తానని మండల ప్రజలు రైతులు అధికారులు సహకారం అందిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

108 వాహనంలో ప్రసవం : తల్లీబిడ్డ క్షేమం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

108 వాహనంలో తల్లీబిడ్డ

ఓ గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సుఖ ప్రసవమైంది.పిటిఎం మండలం, కమ్మ చెరువులో నివాసముండే రాజ్‌కుమార్ భార్య భువనేశ్వరి(20)కి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. భువనేశ్వరిని బి.కొత్తకోట సిహెచ్‌సికి తరలించారు. అక్కడి వైద్యులు సూచన మేరకు మదన పల్లి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో సర్కార్‌తోపు దగ్గర వాహనం లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది ఇఎంటి శైలజ, పైలెట్ చలపతి, ఆశ కార్యకర్త ఆదెమ్మ, తల్లీ బిడ్డను మదనపల్లి డిజిహెచ్‌కు తరలించారు. ఇద్దరూ ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

జగనన్న పాలవెల్లువతో అదనపు లాభం

రామసముద్రం : జగనన్న పాలవెల్లువతో ఆమూల్ పాలకేంద్రం వల్ల అదనపు లాభం వస్తోందని పాడిరైతులు పేర్కొన్నారు. మండలంలోని ఎలకపల్లి ఆమూల్ డెయిరీలో సీతరగానిపల్లి మణి అనే పాడి రైతుకు పోసిన పాల ధర లీటరు రూ.73.40పడటంతో సంతోషం వ్యక్తం చేశారు. జగనన్న పాల వెల్లువతో పాల సేకరణ ధరలు పెరిగాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సరాస రిగా 35 నుంచి 73 రూపాయలు వస్తుండటంతోఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు భాషను తప్పనిసరిగా అమలు చేయాలి

బ్రహ్మంగారిమఠం :తెలుగు భాషను తప్పనిసరిగా అమలు చేయాలని ఎపి అధికార భాష సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య సూచించారు. మఠంలోని బాలుర వసతి గృహం, ఎంఇఒ కార్యాలయం, ప్రభుత్వ బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు.ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే రాసేలా ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయాలని విద్యాశాఖ అధికారికి తెలిపారు.

మహిళా పక్షపాతి సిఎం జగన్ : 'కోరముట్ల'

ప్రజాశక్తి-పుల్లంపేట

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని మహిళా సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ సభా ప్రాంగణంలో ఎంపిడిఒ విజయరావు ఆధ్వర్యంలో నాల్గవ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పెద్దపేట వేస్తున్నది సిఎం జగన్ మాత్రమేనని అన్నారు. మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని హామీ నిచ్చి నాలుగు విడతల్లో వారి పొదుపు ఖాతాల్లో నగదును చెల్లించి రుణ మాఫీ చేశారని అన్నారు. ఎప్పటికప్పుడు మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రతి పథకంలోనూ వారికి ఫలాలను అందిస్తున్నారు. ఓబుల వారిపల్లి మండలంలో 765 స్వయం సహాయక సంఘాలకు గాను సుమారు 32 కోట్ల రూపాయలు వైఎస్ఆర్ ఆసరా కింద నిధులు మంజూరు చేశారని తెలిపారు. సంక్షేమ పాలన కోసం ఎన్నికల సమయానికి మీరంతా సిద్ధంగా ఉండి సిఎం జగన్‌ను మరల ముఖ్యమంత్రిగా చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్ పెద్దలు గతంలో రాష్ట్రాన్ని విభజించి రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేశారని ప్రస్తుతం వైఎస్ కుటుంబంలో చీలికలు తెచ్చి ద్రోహం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సిఎం చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఇ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, ఎంపిపి చీర్ల నాగమ్మ, ఎంపిడిఒ విజయరావు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఇఒపిఆర్‌డి రామ్మోహనరావు, ఎపిఎం ఆర్ముగం, సర్పంచ్‌లు రఫీ, పాపిరెడ్డి, ఏరియా కో-ఆర్డినేటర్ నిరంజన్ పాల్గొన్నారు.


మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన వైసిపి : 'ద్వారక'

గువ్వలచెరువులో నాయకులు, కార్యకర్తలతో పర్యటిస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

వైసిపి ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువు, కసిరెడ్డిగారిపల్లిలో పర్యటించి గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు గ్రామంలోని సమస్యలను ఆయన దృష్టి తీసుకు వచ్చారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో స్థానిక సంస్థలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. గ్రామ సమస్యలను స్థానిక సంస్థలు ద్వారా తీర్చుకోవచ్చని అన్నారు. ఇప్పటికే వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందారని అన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బాదుడే బాదుడుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెరిగిన ధరలను తగ్గించి ప్రజలకు ఆమోదయోగ్య పాలనను చంద్రబాబు అందిస్తారని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు అండగా నిలిచి టిడిపి గెలుపునకు సహకరించాలని కోరారు. అనారోగ్యంతో చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చిన ఎంపిటిసి షేక్ మౌలా తండ్రిని, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కసిరెడ్డిగారిపల్లి చెందిన దుర్గయ్య అనే కార్యకర్తను పరామర్శించారు. ఆయన వెంట ఎంపిటిసి మౌలాలి, రేఖ, ఆంజనేయులు, రాజశేఖర్, శివయ్య, ఉమామహేశ్వర్, రమణా, లోకేష్, రాజు సుబ్బారెడ్డి, నాగవసయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో అందరికీ వైద్యం : డాక్టర్ లోకవర్ధన్

ప్రజాశక్తి-కలికిరి

పేద ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మండలం లోని మర్రికుంటపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈసందర్భంగా డాక్టర్ లోకవర్ధన్ మాట్లాడుతూ ప్రజలు అందరూ ఈ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీ సచివాలయం పరిధిలో ముందస్తు ఇంటింటి సర్వే పూర్తిచేసిన తర్వాత టోకెన్లు అందచేసి వైద్య శిబిరాలకు ప్రజలు హాజరయ్యే విధంగా వాలంటీర్లు, ఆశాకార్యకర్తలు, ఎఎన్ఎంలు, సిహెచ్‌ఒలు కృషి చేస్తున్నారని అన్నారు. ఈరోజు క్యాంప్‌లో 298 మందికి చికిత్సలు అందచేసి వారి వివరాలు ఆన్‌లైన్ చేశామని అన్నారు. నలుగురికి మెరు గైన చికిత్స కోసం ఉన్నతాసుపత్రికి తరించామని తెలిపారు. అనంతరం స్పాట్ సర్వే ఎలా చేస్తున్నారని ఎఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కావ్య, ప్రత్యేక వైద్యులు, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.**తంబళ్లపల్లి:** మండల పరిధిలోని పరస్తోపు గ్రామ సచివాలయం దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఆశాలత, తేజశ్రీ, వంశీధర్ రెడ్డిలు సుమారు 303 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆనంద్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ లోకవర్ధన్

హామీలను నెరవేర్చని పార్టీలను ప్రజలు నమ్మరు

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కలకడ

ఇచ్చిన హామీలను నెరవేర్చలేని పార్టీలను ప్రజలు ఎప్పటికీ నమ్మరని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీనివాస కాంప్లెక్స్‌లో నిర్వహించిన వైసిపి కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజా అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసిపి పట్టం కట్టడం ఖాయమని అన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలాంటి వారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నారని దగ్గర్లోనే వారి విమర్శలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటు అడిగే హక్కు పార్టీ కార్యకర్తలకు ఉందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో దేశంలో ఎక్కడా లేనివిధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారని, తిరిగి ఐదు సంవత్సరాలు పాటు ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. ఈనెల 11న అనంతపురంలో జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సభను విజయవంతం చేసేందుకు మన నియోజకవర్గంలో, కలకడ మండలంలో భారీగా స్కూటర్ ర్యాలీ నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. గతంలో ఇచ్చిన హామీలను, మాయ మాటలను ప్రజలు నమ్మకుండా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎన్నుకున్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థ, సచివాలయం వ్యవస్థ, రద్దు చేసి పాలనను ప్రజలకు దూరం చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎపి ఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్ రెడ్డి, ఎంపిపి శ్రీదేవి రవికుమార్ మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయుడు, ఆర్‌బికె చైర్మన్ హరినాథ్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి కో-ఆప్షన్ సభ్యులు ఇనయతుల్లా ,ప్రత్యేక ఆహ్వానితులు జీవి కిషోర్,సరళ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**కలికిరి :** సిద్ధం సమావేశాన్ని జయప్రదం చేయాలని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వెల్లడించారు. స్థానిక మండల కేంద్రంలోని ఆర్ఎన్ఆర్ కల్యాణ వేదిక హాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురంలో జరిగే సిద్ధం సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని ప్రతి నాయకులు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేపట్టినటువంటి పథకాలు అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఇంటికి తీసుక పోవాలని అన్నారు. సమావేశానికి హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వము తేనటువంటి విధంగా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో చేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరిందని ఈ విషయాన్ని ప్రతి కుటుంబానికి తెలియజేసి రా బోవు ఎన్నికలలో మరొకసారి వైసీపీ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. . ఈ కార్యక్రమంలో ఎపి ఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, రాష్ట్ర మార్కెట్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

నిరాశ్రయులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలోని మహాత్మా గాంధీ నిరశ్రాయుల వసతి గృహంలో ఉండే పేదలకు శుక్రవారం ఖాజీపేట మండలం బి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ గోసుల విజయరాఘవరెడ్డి ఆర్థికసాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. వీటిని దాత తండ్రి విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ జి.వీరరాఘవరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్స్ అధ్యక్షుడు పెరుగు కృష్ణయ్య యాదవ్, హెల్పర్ మేనేజర్ వెంకట శివయ్య, వీరరాఘవ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర సూచించారు. మైదుకూరు మున్సిపాలిటీలో తాగునీటిపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మున్సిపాలిటీ అధికారులు, పంపు ఆపరేటర్‌లతో వార్డుల వారీగా సమీక్షించారు. తాగునీటి సమస్య ఉన్న వార్డులో సత్వరమే పరిష్కార చర్యలు చేపట్టేలని సూచించారు. నీటి సమస్య ఉన్న బోర్లలో పైపులు దింపాలని, అడ్డంకులు ఉన్న చోట తొలగించాలని, కొత్త బోర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులకు సూచించారు. పంపు ఆపరేటర్లు పనిపట్ల అలసత్వం వహించకుండా నిరంతరం పర్యవేక్షణ చేసి నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎక్కడ సమస్య ఉన్నా మున్సిపాలిటీ అధికారుల, చైర్మన్ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఆపరేటర్లకు తెలిపారు. వేసవిలో నీటి సమస్య రాకుండా అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, పంపు ఆపరేటర్లు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎరువుల దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని బద్వేల్ డివిజన్ వ్యవసాయం సహాయ సంచాలకులు ఎం.నాగరాజ హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్స్, స్టాక్ వివరాలు, ధరల బోర్డ్, బిల్లులు, ఇన్వాయిస్, వే బిల్లులు, ఫార్మ్ ఒ, తూకాలు, స్టాక్ రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల సక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎమ్మార్పీకి నాణ్యమైన సరుకు రైతులకు ఇవ్వాలన్నారు. గడువు ముగిసిన పురుగు మందులను అమ్మరాదని హెచ్చరించారు. చాలన్నారు. అమ్మిన సరుకునకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తనిఖీల్లో సుమమాధురి, రేష్మ పాల్గొన్నారు.

మహారాజశ్రీ పీలేరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 176/2022
O.S.No.96 of 2013

వై.ఆనంద్ మరియు వగైరాలు.
...పిటిషనర్స్/వాదులు
Vs
డి.సలార్ సాహెబ్ మరియు వగైరాలు.
...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

రెస్పాండెంట్స్/ప్రతివాదులకు నోటీసు

రెస్పాండెంట్స్/ప్రతివాదులు 1 నుండి 3:
1. డి.సలార్ సాహెబ్, S/o మొహమ్మద్ హనీఫ్,
2. డి.ఇక్బాల్ మహమ్మద్, S/o మొహమ్మద్ హనీఫ్,
3. డి.ముబారక్, S/o మొహమ్మద్ హనీఫ్,
1 to 3 r/at దిగువ వీధి (జండామాను వీధి), కలకడ గ్రామం, పోస్ట్, మండలం, అన్నమయ్య జిల్లా,

పై కనిన వాదులు దాఖలు చేసిన పై పిటిషన్‌లో మీ హాజరు నిమిత్తమై తేది:07.02.2024న వాయిదా వేసిఉన్నారు, కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని కోర్టు నందు తేది:07.02.2024న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ఎదుట హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను, లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

//By Court Order//
ఎ.వి.బాలసుబ్రమణ్యం,B.Com., B.L.,
న్యాయవాది, పీలేరు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE:: PILER
H.M.O.P.No. 25 of 2023

Sri B.Naveen Kumar.
...Petitioner
Vs
Smt. D.Hemavathi.
...Respondent

NOTICE TO RESPONDENT

To,
Smt D.Hemavathi, W/o B.Naveen Kumar, D/o Chinnappa, R/at Balaiahkunta Vaddipalle, H/o Korlakunta,Kalikiri Mandal,Annamayya District.

Where as the above named petitioner filed the above petition for grant of Divorce and the same Is hereby posted to 06.02.2024 for your appearance. Hence,you are hereby noticed to attend either personally or through a pleader and represent your case,else the matter will be decided as ex-parte.

//By Order of the Honourable Court//
A.NARASIMHA REDDY,
Advocate for petitioner

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.A.No:226/2022 in OS 142/2018

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, బోయనపల్లి, రెప్రెజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్. ...పిటిషనర్/వాది

వర్సెస్

కాకలూరి గంగిరెడ్డి డైడ్ హిజ్ ఎల్ ఆర్స్ 4&5
4. కాకలూరి శివశంకర్ రెడ్డి తండ్రి లేట్ గంగిరెడ్డి
5.కాకలూరి వేణుగోపాల్ రెడ్డి తండ్రి లేట్ గంగిరెడ్డి
4&5 రెస్పాండెంట్ల నివాసం తాళ్లపాక గ్రామం&పోస్టు రాజంపేట మండలం.

నోటీసు

పిటీషనరు/వాది దావాలో ఒకటవ ప్రతివాది చనిపోగా 4 & 5 రెస్పాండెంట్లను వారసులుగా చేర్చమని పై పిటిషన్ దాఖలు చేసి యుంటున్నారు. సదరు పై పిటీషన్‌లో 4&5 రెస్పాండెంట్లకు నోటీసులు పంపినను తీసుకోలేదు. కావున 4&5 రెస్పాండెంట్లు 24.02.2024 వ తేదీన ఉదయం 10 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోనంతట పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
ఏ.వి సుబ్రమణ్యం
అడ్వకేట్,
నందలూరు.

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తహశీల్దార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె తహసిల్దార్ శ్రీనివాసులను శుక్రవారం రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన బదిలీపై వెళ్తున్న సందర్భంగా కార్యాలయంలో డిటి మౌలా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు సిబ్బంది శాలవాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు సిబ్బందితో స్నేహభావంతో మెలిగి ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన కృషి అభినందనీయమని అన్నారు. నూతన తహసిల్దార్ వచ్చేవరకు డిటి మౌలా ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా వ్యవహరిస్తారు.

రేపు టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-బి. కొత్తకోట

పట్టణంలోని కొండా ఎస్టేట్‌లో నియోజకవర్గం స్థాయి టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు కొండా నరేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో జరగబోవు శాసనసభ ఎన్నికలకు ఇరు పార్టీల శ్రేణులను సమాయత్తం చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అధికార వైసిపి అవలంబిస్తున్న అరాచక విధానాలతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు వైసిపి పాలనలో విసిగిపోయారని అన్నారు. అన్ని ధరలను పెంచి పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బ కొట్టారని అన్నారు. ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళలు, నిరుద్యోగులకు, యువతకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ప్రజలకు అన్నివిధాలా మేలు జరగాలంటే జనసేన, టిడిపి కూటమి అధికారంలోకి తీసుక రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గంలోని టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి యువకుడి మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విష్ణువర్ధన్(ఫైల్ ఫొటో)

రైలు కింది యువకుడు మృతి చెందిన సంఘటన వాల్మీకిపురం పట్టణం పునుగుపల్లి సమీపంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మదనపల్లి మండలం, బసినికొండ పంచాయతీ గంగన్నవారిపల్లికి చెందిన కనమన్న కుమారుడు విష్ణువర్ధన్(25) వాల్మీకిపురం పట్టణం పును గుపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడని తెలిపారు. అక్కడ సమీపంలోని రైల్వేలైన్ వద్ద రైలు కింద పడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన నిమ్మనపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... అగ్రహారం పంచాయతీ చింతపర్తివారి పల్లెకు చెందిన బండి వెంకటరమణ (80) ఇటీవల వ్యవసాయ పొలం వద్ద గాయపడి కాలుకి గాయమైందన్నారు. స్థానిక ప్రాథమిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. నిమ్మనపల్లి ప్రాథమిక ఆస్పత్రిలో గాయానికి చికిత్స చేయించుకోవడానికి తన కుమారుడు బండి నాగరాజతో కలసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా తవళం రోడ్డులోని వినాయక మెకానిక్ షెడ్ వద్ద నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ట్రాక్టర్ డ్రైవర్ హఠాత్తుగా రోడ్డుపై మళ్ళించడంతో ఒక్కసారిగా ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వృద్ధుడి కాలికి మరోసారి తీవ్ర గాయం అయిందన్నారు. 108 వాహనంలో వృద్ధుడుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వివరాలు సేకరించి, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంగంవారిపల్లి పంచాయతీ దేవరెడ్డి దళితవాడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వై.సహదేవను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చర్యలు చేపట్టారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

నాటుసారా విక్రయస్థావరం పై శుక్రవారం నిమ్మనపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సి.లోకేష్ రెడ్డి తెలిపారు. వాల్మీకిపురం మండలం, చింత పర్తి పంచాయతీ, మేకలవారిపల్లి గ్రామానికి చెందిన మేకల చిన్నరెడ్డప్ప(33) నిమ్మనపల్లి మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ, ఎర్రాతివారిపల్లి వద్ద నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులకు రాబడిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడులు చేసి అతని వద్ద నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, కానిస్టేబుల్ నంద పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం..

స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, నిందితుడితో పోలీసులు

ములకలచెరువు : కర్ణాటక మద్యం అమ్ముతున్న వ్యక్తిని మొలకలచెరువు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ తిప్పేస్వామి, ఎఎస్ఐ నజీర్ కథనం మేరకు.. బి.కొత్తకోట మండలం,తుమ్మలగుట్ట గ్రామం, మల్లూరువాండ్లపల్లికి చెందిన ఉత్తన్న కుమారుడు ఆకుల వెంకటరమణ(40), ములకల చెరువు మండలంలోని సెంట్రల్ స్కూల్ సమీపంలో స్థానికులకు కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమా చారంతో తమ సిబ్బందితో కలిసి తాడు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ దాడిలో వెంకటరమణ నుంచి 18 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

ముగ్గురు కోడిపందెంరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-రామసముద్రం

కోడిపందెం స్థావరాలపై దాడులు చేసి కోడిపందెం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని కురిజల పంచాయతీ బరిడేపల్లి గ్రామ సమీపంలోని తట్లగుంట వద్ద కొందరు వ్యక్తులు కోడిపందెం అడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మరి కొందరు తప్పించుకొని పారిపోయారని పేర్కొన్నారు. పట్టుబడిన వారి నుంచి రెండు కోడిపుంజులు రూ. 2990 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.